మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర    సంపుటి : 08    సంచిక : 195    శనివారం    17 - 01 - 2026    పేజీలు: 8    వెల: 4

## ఇది మంచి ప్రభుత్వం


3లో..

## సోర్ట్స్ హాస్టల్‌లో ఇద్దరు మైనర్ అమ్మాయిల ఆత్మహత్యలు..




కొల్లాం -- 16 జనవరి 2026 -- మన గళం, : కేరళ రాష్ట్రంలోని కొల్లాంలో ఉన్న క్రీడల శిక్షణ వసతి గృహంలో 2 లో..

## ముంబైలో కమలం జోరు..

- ధానేలో శివసేన దూకుడు.. ఫలితాల్లో హాట్ టెన్షన్!!



ముంబై -- 16 జనవరి 2026 -- మన గళం : మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి దూకుడు ప్రదర్శిస్తోంది. 2 లో..

## ఇరాన్ చెరలో 16 మంది భారత నావికులు..

- కేంద్రానికి కుటుంబాల విజ్ఞప్తి!


2 లో..

# తిరుపతిలో ఏపీ ఫస్ట మెగా రీసెర్చ్ సెంటర్



- తిరుపతిలో 'ఏపీ ఫస్ట పేరుతో భారీ పరిశోధన కేంద్రం
- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం
- వ్యవసాయం, వైద్యంలో డ్రోన్ల వినియోగం పెంచాలని సూచన

తిరుపతి : 16 జనవరి 2026 -- మన గళం : ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' 2 లో..

## గ్లోబల్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి కొత్త పాఠం


2 లో..

## కనుమ పండుగ రోజున విషాదం..

- బీచ్‌లో స్నానానికి వెళ్లి నలుగురు గల్లంతు


2 లో..

## జార్ఖండ్‌లో వలస కార్మికుడు మృతి..


2 లో..

## చంద్రబాబు హింసా రాజకీయాలు.. మూల్యం చెల్లించక తప్పదు : వైఎస్ జగన్

అమరావతి :మన గళం : ఏపీలోని గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళితుడు మందా సాల్మన్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్ చేశారు. రాజకీయ కక్షలతో ఇంకా ఎంతమంది ప్రాణాలను బలితీసుకుంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. హింసారాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబు ను 2 లో..



# స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇద్దరు మైనర్ అమ్మాయిల ఆత్మహత్యలు..

ఇద్దరు మైనర్ క్రీడాకారిణులు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున ఈ విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. ఉదయం శిక్షణకు హాజరు కాకపోవడంతో సిబ్బంది వారి గదిని పరిశీలించగా తలుపు లోపల నుంచి మూసి ఉండటంతో తెరిచి చూడగా పైకప్పు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించారు.

మృతుల్లో ఒక అమ్మాయి కోజికోడ్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థిని కాగా అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతోంది. మరో అమ్మాయి తిరువనంతపురానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని కాగా కబడ్డీలో శిక్షణ తీసుకుంటోంది. ఇద్దరూ క్రీడల శిక్షణ సంస్థ నిర్వహించే వసతి గృహంలో ఉంటున్నారు.

ఈ ఘటనపై కొల్లాం తూర్పు ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని అధికారులు తెలిపారు. ఆత్మహత్యలకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

# ముంబైలో కమలం జోరు..

ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేతో జతకట్టిన భారతీయ జనతా పార్టీ చాలా మున్సిపాల్టీల్లో ముందంజలో కొనసాగుతోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 227 వార్డుల్లో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ 62 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మరో 46 స్థానాల్లో కూడా ఆ పార్టీకి ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. షిండేకు చెందిన శివసేన 16 వార్డుల్లో లీడింగ్‌లో కొనసాగుతోంది.

థాకరే సోదరులు కలిసి ప్రచారం చేసినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని వర్గం 10 స్థానాల్లో, రాజ్ థాకరే నేతృత్వంలోని వర్గం 6 స్థానాల్లో ముందంజలో ఉంది. షిండేకు బలమైన పట్టున్న థానేలో శివసేన ఆధిక్యంలో కొనసాగుతోంది. అక్కడ మొత్తం 131 వార్డుల్లో 9 వార్డుల్లో శివసేన ముందంజలో ఉంది.

పుణెలో భారతీయ జనతా పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. అక్కడ 32 స్థానాల్లో ఆ పార్టీ లీడింగ్‌లో ఉండగా, అజిత్ పవార్ నేతృత్వంలోని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 29 మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగగా, ఎగ్జిట్ పోల్స్ ప్రకారం మహాయుతి కూటమికి అనుకూల ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముంబైలో సుమారు 52 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది.

# ఇరాన్ చెరలో 16 మంది భారత నావికులు..

న్యూఢిల్లీ -- 16 జనవరి -- మన గళం : ఇరాన్‌లో అదుపులో ఉన్న 16 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత నెలలో సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్న ఒక నౌకను స్మగ్లింగ్ అనుమానంతో ఇరాన్ నావికాదళం అదుపులోకి తీసుకుంది. ఆ నౌకలో మొత్తం 18 మంది నావికులు ఉండగా, అందులో 16 మంది భారతీయులు ఉన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో తమ కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజులకుపైగా నిర్బంధంలో ఉన్న నావికులకు సరైన వైద్య సహాయం, న్యాయ పరిరక్షణ, ఆహార సదుపాయాలు కల్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అవసరమైతే ఇరాన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి వారిని త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నావికుల కుటుంబ సభ్యులు ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కు వాయిదా వేసింది. అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న సమయంలో సుమారు 6 వేల టన్నుల ఇంధనం అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలతో నౌకను వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆ సమయంలో కొంతమంది నావికులను జైలుకు తరలించగా, మిగిలిన వారిని కఠిన నిఘాలో ఉంచినట్టు తెలుస్తోంది. ఈ నావికులంతా సముద్ర ప్రయాణాలకు అనుమతి పొందిన అర్హత కలిగినవారేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

తమ వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కుటుంబాలు కోరుతున్నాయి.

# కనుమ పండుగ రోజున విషాదం..

అమరావతి :జనవరి 16 మన గళం : ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో కనుమ పండుగ రోజున విషాదం (ఒతీఖుస్త్రవసఎ) చోటు చేసుకుంది. సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్న యువకులు కనుమను కూడా అంతే ఘనంగా జరుపుకోవటానికి సన్నద్ధం అవుతున్న సమయంలో మృతి చెందారు. జిల్లాలోని అల్లూరు మండలం ఇసుకపల్లి బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు యువకులు స్నానం చేస్తూ గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మిగతా ముగ్గురు యువకుల కోసం మత్స్యకారులు, పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఇంకా మృతి చెందిన, గల్లంతైన వారి వివరాలు తెలియరాలేదు.

# జార్ఖండ్‌లో వలస కార్మికుడు మృతి..

కోల్‌కతా:16 జనవరి 2026 -- మన గళం : పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కార్మికుడు జార్ఖండ్‌లో మరణించాడు. బెంగాల్ మాట్లాడినందుకు అతడ్ని కొట్టి చంపారని మృతుడి కుటుంబం ఆరోపించింది. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో జరిగిన భారీ నిరసన ఉద్రిక్తతలకు దారితీసింది. ముర్షిదాబాద్ జిల్లాలోని బెల్డంగాకు చెందిన 37 ఏళ్ల అల్లావుద్దీన్ షేక్ జార్ఖండ్‌లో చిరు వ్యాపారం చేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఉరికి వేలాడుతూ శవమై కనిపించాడు. కాగా, బెంగాలీ మాట్లాడే వలస కార్మికుడు కావడంతో అల్లావుద్దీన్ షేక్‌ను కొట్టి చంపినట్లు అతడి కుటుంబం ఆరోపించింది. శుక్రవారం బెల్డంగాలో అతడి మృతదేహంతో భారీ నిరసన చేపట్టారు. జాతీయ రహదారి 12ను నిరసనకారులు దిగ్బంధించడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆ మార్గంలో రైలు సేవలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు ఈ నిరసనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా సిబ్బందిపై గ్రామస్తులు దాడి చేశారు. మహిళా రిపోర్టర్లు సహా ఐదుగురు జర్నలిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు. కాగా, సీఎం మమతా బెనర్జీ ఈ సంఘటనపై స్పందించారు. ఇలాంటి పరిస్థితుల్లో జన సమూహాలను నియంత్రించడం కష్టమని తెలిపారు. 'జర్నలిస్టులపై దాడులకు నేను మద్దతు ఇవ్వడం లేదు. కానీ వారు గుంపు లోపలికి వెళ్లకుండా ఉండాలి. అది నా చేతుల్లో లేదు' అని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం అశాంతిని రాజేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని మమతా బెనర్జీ ఆరోపించారు. అయితే బెంగాల్‌లో శాంతి భద్రతలు లోపించాయని బీజేపీ విమర్శించింది.

# చంద్రబాబు హింసా రాజకీయాలు.. మూల్యం చెల్లించక తప్పదు : వైఎస్ జగన్

ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని, ఇలాంటి ఘటనలకు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడ్డానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే ఇనుప రాడ్లతో కొట్టి దారుణ హత్యచేసి, సాల్మన్‌పైనే తప్పుడు ఫిర్యాదు చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి దారుణాలు చేయడానికా మీరు అధికారంలోకి వచ్చిందా అంటూ మండిపడాడరు. ఈ ఘటన ముమ్మాటికీ వైయస్సార్‌సీపీని భయపెట్టడానికి, కట్టడిచేయడానికి మీరు, మీ పార్టీవారి ద్వారా, కొంతమంది పోలీసులు ద్వారా చేస్తున్న చేయిస్తున్న రాజకీయ హింసాత్మక దాడుల పరంపరలో భాగమేనని ఆరోపించారు. ఎమ్మెల్యే, పోలీసుల బెదిరింపులతో పిన్నెల్లి గ్రామం నుంచి వందలకొద్దీ వైయస్సార్ కార్యకర్తల కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని వెల్లడించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా తమ జీవితాలను గడిపేలా చూడ్డం మీ బాధ్యత కాదా? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రిగా ఉండి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏది విత్తుతారో అదే రేపు పండుతుందన్నది ఎప్పుడూ మరిచిపోకూడదు. టీడీపీవారి చేతిలో హత్యకు గురైన సాల్మన్ కుటుంబానికి వైయస్సార్‌సీపీ అండగా ఉంటూ ఆదుకుంటుందని అన్నారు.

# తిరుపతిలో 'ఏపీ ఫస్ట్ మెగా రీసెర్చ్ సెంటర్

పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.

**– డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి**

ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు.

"డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ల వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్లోబల్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి కొత్త పాఠం



అమరావతి, జనవరి 16 మన గళం : అంతర్జాతీయ స్థాయి రహదారిని నిర్మించడానికి సంవత్సరాలు పడతాయన్న సాధారణ భావనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తిగా మార్చేసింది. ప్రపంచ రోడ్డు నిర్మాణ చరిత్రలోనే విప్లవంగా నిలిచే రీతిలో, నిమిషాలు--గంటల లెక్కలో పనులు పూర్తి చేస్తూ గ్లోబల్ రికార్డ్స్‌కు కొత్త నిర్వచనం ఇస్తోంది. ఈ వేగం ప్రపంచ దేశాలను నివ్వెరపోయేలా చేస్తోంది.

కేవలం 24 గంటల్లోనే 28.95 లేన్ కిలోమీటర్ల రోడ్డును నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అపూర్వమైన రికార్డు సృష్టించింది. ఇది ప్రపంచంలో మరే దేశానికీ సాధ్యం కాని వేగమని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, ఒక్క రోజులో 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీటును వినియోగించడం ఇంజనీరింగ్ రంగంలో అద్భుతంగా నిలిచింది. ఈ గణాంకాలు ప్రపంచంలోనే అత్యధికమని వెల్లడించారు.

ఈ నిర్మాణ పనుల్లో 70 అత్యాధునిక టిప్పర్లు, ప్రపంచ స్థాయి మిక్సింగ్ ప్లాంట్లు వినియోగించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, జాతీయ రహదారి ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూ పనులు పూర్తి చేయడం విశేషం. వేగంతో పాటు నాణ్యతను సమానంగా సాధించడం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతగా నిలుస్తోంది.

ఒకప్పుడు గిన్నిస్ రికార్డులు అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితమన్న భావన ఉండేది. కానీ ఇప్పుడు "భారత్ నిర్మిస్తుందా ఆంధ్రప్రదేశ్ అందిస్తుంది" అన్న నినాదంతో ప్రపంచ వేదికపై రాష్ట్రం తన సత్తా చాటుతోంది. బెంగళూరు--విజయవాడ ఎకనామిక్ కారిడార్ ద్వారా 12 గంటల ప్రయాణాన్ని కేవలం 6 గంటలకు తగ్గించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఇది ప్రపంచంలోనే అత్యంత వేగంగా పూర్తయిన ఎక్స్‌ప్రెస్ రహదారిగా నిలవనుందని అంచనా వేస్తున్నారు.

మహారాష్ట్రలో ఇప్పటికే రికార్డులు సృష్టించిన రాజ్ పథ్ ఇన్ఫ్రాకాన్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఏకంగా నాలుగు గిన్నిస్ రికార్డుల లక్ష్యంతో ముందుకెళుండటం రాష్ట్ర అభివృద్ధి కాంక్షకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక ప్రాజెక్టు విజయం మాత్రమే కాదు రాష్ట్ర పట్టుదల, కార్యదీక్ష, ప్రగతిశీల ఆలోచనల ప్రతిబింబం. ఈ ఎక్స్‌ప్రెస్ రహదారికి అంకురార్పణ జరిపి, గత పాలనలో డిజైన్ మార్పులు, భూసమస్యలు ఎదురైనా, పట్టుదలతో ముందుకు తీసుకువచ్చిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పర్యావరణ అనుమతులు సాధించి, అన్ని అడ్డంకులను తొలగించి ఈ గ్లోబల్ స్పీడ్‌కు మార్గం సుగమం చేశారని వారు అంటున్నారు. ఈ ఘన విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా అభినందనలు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# జాతీయస్థాయి పోటీలలో టీజీ వెంకటేష్ జట్టుకు రండవ స్థానం





మనగళం, కర్నూలు సిటీ : ఆత్రేయపురంలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగిన జాతీయస్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో టిజి వెంకటేష్ కర్నూలు బోటింగ్ క్లబ్ జట్టు రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ కర్నూలు బోటింగ్ క్లబ్ జట్టుకు కేంద్ర భారీ పరిశ్రమలు,ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఎంపీ హరీష్,ఎమ్మెల్సీ రాజశేఖరం, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లు ట్రోఫీతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ సెక్రెటరీ అవినాష్ శెట్టి, డి.ఎస్.ఏ వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

# రూ. 50వేల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు కృషి

**- మంత్రి టీజీ భరత్**

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో వాసఅబశ్రీశ్రీవి ప్రీమియర్ లీగ్-9 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాసవి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కర్నూలులో మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించేలా కృషి చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఇక కర్నూలు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కర్నూలులో అందుబాటులో లేంని ఎవరైనా తన గురించి అడిగితే.. మంత్రిగా ఇతర రాష్ట్రాలు, దేశాలు తిరిగి పనిచేయాల్సిన అవసరాన్ని అర్థమయ్యేలా చెప్పాలన్నారు. తాను ఎక్కడ ఉన్నా కర్నూలు ప్రజలకు సేవ చేసేందుకు నిత్యం ఆలోచిస్తుంటానన్నారు.ఓర్వకల్లుకు భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు



ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధీర్, శ్రీకాంత్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి

**- కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి.**

మనగళం, కర్నూలు సిటీ : ప్రముఖ కవి, సంస్కర్త, హేతువాది కవిరాజు త్రిపురనేని రామస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్.సిరి, సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సామాజిక సంస్కరణలకు ప్రతీకగా నిలిచిన కవిరాజు త్రిపురనేని రామస్వామి గారిని స్మరించుకోవడం ప్రతి తెలుగువారికి గర్వకారణమని అన్నారు. కులవ్యవస్థ, మూఢనమ్మకాలు, మత అంధవిశ్వాసాలు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకుని సమాజంలో ఆలోచనా విధానానికి బీజం వేసిన మహనీయుడు అని కొనియాడారు. సెట్కూరు సీఈఓ డాక్టర్.వేణుగోపాల్ మాట్లాడుతూ త్రిపురనేని రామస్వామి గారు ప్రజలను మేల్కొలిపే హేతువాద భావాలతో రచనలు చేసి, ఆచరణాత్మక మార్పుకు దారి చూపిన రామస్వామి గారు కేవలం కవి మాత్రమే కాకుండా ఒక సంస్కర్త, ఒక హేతువాది, ఒక మానవతావాది అని తెలిపారు. "ఆలోచించండి -- ప్రశ్నించండి -- మార్పు తీసుకురండి" అనే సందేశంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన దార్శనికుడు



కవిరాజు త్రిపురనేని రామస్వామి గారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సిబ్బంది, స్పెషల్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది మంచి ప్రభుత్వం

**- మా పాలనలో అభివృద్ధి జరుగుతోంది**
**- మంత్రి టీజీ భరత్**







మనగళం, కర్నూలు సిటీ : తమ ప్రభుత్వం మంచి ప్రభుత్వమని, తమ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్ లో వార్డు ఇంచార్జి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధానంలో పనిచేస్తున్నామన్నారు. గతంలో కొందరు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. వారి వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు చెప్పారు.

ఒక టార్గెట్ పెట్టుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. కర్నూల్ జిల్లా ఓర్వకల్లుకు ఇప్పటికే 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చామన్నారు. ఇప్పటికే రిలయన్స్, ఇతర కంపెనీలు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజలందరూ సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలన్నారు. వార్డులోని అబ్దుల్ కలాం పాఠశాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు ముంతాజ్, జేమ్స్, మనోజ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మారుతి శర్మ, నగర అధ్యక్షుడు కొరకంచి రవి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజ్ కుమార్, సీనియర్ నాయకులు, బూత్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ హబ్ లో కంపెనీల ఏర్పాటు త్వరగా జరగాలి

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా లో మిగిలిన నియోజకవర్గా ల లో ఎమ్. ఎస్. ఎమ్. ఈ. పార్క్ ల కొరకు భూములు అప్పగింత, ఓర్వకల్ హబ్ లో పరిశ్రమల స్థాపనకు చొరవ చూపాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో పత్తికొండ , కోడుమూరు నియోజకవర్గాలలో ఎమ్. ఎస్. ఎమ్. ఈ పార్క్ లకు ఇవ్వ వలసిన స్థలాల ను అన్ని సాంకేతిక కార్యక్రమాలు పూర్తిచేసుకుని అప్పగించే చర్యలు వెంటనే తీసుకోవాలని ఆర్డిఓ పత్తికొండ భరత్ నాయక్, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, ఏపీఎంఐసి జెడ్ ఎం మధుసూధన్ లను ఆదేశించారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్, ఇతర ప్రదేశాలలో డి పి ఆర్ సమర్పించి భూములను స్వాధీనం చేసుకున్న కంపెనీల వారు వెంటనే భూమి పూజలకు సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిపిఆర్ సమర్పించని వారిని వెంటనే సమర్పించే విధంగా చర్యలు , భూములు కేటాయించిన కంపెనీల వారిని వెంటనే స్థలాల పరిశీలన చర్యలు తీసుకోవాలని జిల్లా మేనేజర్ పరిశ్రమల శాఖ , జెడ్ ఎమ్ ఏపీఐఐసీ , ఎన్ఆర్ఇ డి (నెడ్ క్యాప్ ) డెవలప్మెంట్ ఆఫీసర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్పోనేట్ టిక్ కంపెనీ, టర్బో ఏవియేషన్ సంస్థలకు ఇవ్వవలసిన భూముల విషయాలను కర్నూలు ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన చర్యలు తీసుకొని వలసిందిగా డైరెక్టర్ ను ఆదేశించారు. టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కు ఓర్వకల్ రాక్ గార్డెన్స్ లో స్థలాలు మరియు బనవాసి లో హ్యాండ్లూమ్ డిపార్ట్మెంట్ కు స్థలాల విషయాలపై సంబంధిత ఆర్డీవోలతో మాట్లాడి సూచనలు జారీ చేశారు. ఈ సమావేశానికి డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , జిఎం ఇండస్ట్రీస్ జవహర్ బాబు, ఎన్ ఆర్ డి పి డెవలప్మెంట్ ఆఫీసర్ వీరేంద్ర, జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, ఎల్ డి ఎం రామచంద్ర రావు, ఏపీఎంఐపీ పిడి సుధాకర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు - పత్తికొండ ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జెడ్ ఎమ్ మధుసూదన్ పాల్గొన్నారు.



# రెగ్యులర్ ఉద్యోగ నియామకాని దరఖాస్తుల ఆహ్వానం

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవ సదన్ కర్నూలు నందు రెగ్యులర్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రికార్డ్ అసిస్టెంట్ -1, ఫ్రంట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ -1, డేటా ఎంట్రీ ఆపరేటర్ -1, పోస్టులకు తగిన అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలు, ఇతర వివరాలు నోటిఫికేషన్స్ నెంబర్. 1/2026,2/2026, 3/2026 లో ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ అప్లికేషన్స్ కర్నూలు జిల్లా కోర్టు వెబ్సైట్ లో అందు బాటులో కలవని తెలిపారు. ఈనెల జనవరి 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా చెర్మన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా కోర్ట్ కాంపౌండ్, కర్నూలు అడ్రస్ కు రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్ట్ లో మాత్రమే అభ్యర్థులు దరఖాస్తులను పంపాలని సూచించారు.

## సన్ రైస్ వాలీబాల్ కమిటీ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అంతరాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్





మనగలం : సున్నిపెంట : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సన్ రైస్ వాలీబాల్ ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ గత రెండు రోజులుగా కొనసాగుతుంది. ఈ టోర్నమెంట్కు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి, సున్నిపెంట రెండో పట్టణ సీఐ జి.సుబ్బారావు, ఎస్పీఎఫ్ ఆరా రాజేష్, తెదేపా నాయకులు ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు నాగ సాయిరాం, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కాకా హాజరై రిబ్బన్ కట్ చేసి పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్కు అనంతపురం టీమ్, అనంతపురం పోలీసు టీమ్, ములుగు టీమ్, వైజాగ్ టీమ్, అనకాపల్లి టీమ్, శ్రీకాకుళం టీమ్, మహబూబ్ నగర్ పోలీస్ టీమ్, మహబూబ్ నగర్ హాస్టల్ టీమ్, అచ్చంపేట టీమ్, సర్వీస్ టీమ్, మంగళూరుటీమ్, సన్ రైజ్ టీమ్ లు తలపడినట్లు సన్ రైజ్ కమిటీ నిర్వాహకులు శ్రీను తెలిపారు.

## శ్రీ హరి హర క్షేత్రం నందు సుమన్ టీవీ 2026 క్యాలెండర్ విడుదల చేసిన ఎద్దుల మహేశ్వర్ రెడ్డి





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని స్థానిక శ్రీ హరి హర క్షేత్రమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కర్త మరియు ధర్మకర్త ఎద్దుల మహేశ్వర్ రెడ్డి సుమన్ టీవీ 2026 సంవత్సరం క్యాలెండర్ ను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్షేత్రం యొక్క విశిష్టతను వారు తెలియజేశారు కోడుమూరులో గల శ్రీ హరిహర క్షేత్ర పునర్నిర్మాణము అత్యంత వైభవంగా జరుగుతుంది ఇక్కడ జరిగే సంకల్ప మహా యజ్ఞంలో నిత్యభిషేకములు మరియు నిత్య సోడాపచార పూజలు, నిత్య అభిషేకములు మరియు నిత్య ప్రసాద వితరణ కార్యక్రమం భవిష్యత్తులో దేవాలయం తయారైన తర్వాత ఇక్కడ జరుగుతాయని వారు తెలియజేశారు అలాగే భారత దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఒకే వేదిక పైన హరిహరులకు శైవ వైష్ణవ పద్ధతిలో నిత్య కళ్యాణము మరియు నిత్య రథోత్సవము జరుగునని వారు ఈ సందర్భంగా తెలియజేశారు అలాగే దేవాలయాలు ధర్మ నిలయాలే కానీ వ్యాపార సముదాయాలు కాదని చాటి చెప్పే దేవాలయంగా ఈ హరిహర క్షేత్రం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం రూపొందుతుందని ఇంత అద్భుతమైన పునర్నిర్మాణ రూపొందించడానికి సహాయం చేసే ప్రతి దాతకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే సుమన్ టీవీ ప్రేక్షకులకు మరియు సుమన్ టీవీ యాజమాన్యానికి మరియు కోడుమూరు పుర ప్రజలకు హరిహర క్షేత్రం తరపున హృదయపూర్వక సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు వారు తెలియజేశారు భవిష్యత్తులో ఈ హరిహర క్షేత్రాన్ని తప్పనిసరిగా దర్శించుకుని ఈ ఇలలోనే వైకుంఠము కైలాసం ఒకటే చోట దర్శనమిచ్చే ఈ దేవాలయానికి ప్రతి ఒక్కరూ దర్శించుకుని ఆ స్వామివారి అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు మనస్ఫూర్తిగా కోరుకున్నారు ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు రాజశేఖర్ రామకృష్ణ దామోదర్ వెంకటస్వామి రంగస్వామి కిషోర్ మధుసూదన్ వెంకటేశ్వర్ రెడ్డి గంగాధర్ ముక్తినాథ్ తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంపై రైతులు ఆనందం..

**- టీడీపీ మండల కన్వీనర్ కాసింవలి..**





జనవరి నందవరం 16 మనగళం న్యూస్... : నందవరం మండల పరిధిలోనే స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కన్వీనర్ ఖాసింవలి మాట్లాడుతూ ఈరోజు ఎమ్మిగనూరు బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు తాలూకాలో సీసీ ద్వారా పత్తి కొనుగోలు 7856 మంది రైతులకు సీసీ ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరిగిందని మొత్తం రైతులకు వారి అకౌంట్లోకి 126 కోట్లు రైతులకు జమ చేసింది. ప్రభుత్వము పత్తి కొనుగోలు స్వీకరించిన మొత్తం1, 62 709 క్వింటాలను కొనుగోలు చేసింది. మాజీ మంత్రివర్యులు బివి మోహన్ రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం దృష్టిలో ఉంచుకొని ఎమ్మిగనూరు నియోజకవర్గం లోనే దాదాపు 350 కోట్ల రూపాయలను గురు రాఘవేంద్ర ప్రాజెక్టును ఏర్పాటు చేశారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడు రైతుల శ్రేయస్సు కొరకు నిత్యం శ్రమించే నాయకుడు అదేవిధంగా 1900 కోట్లు ఆర్డీఎస్ కుడి కాలువకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని తెలిపారు. ఈ కెనాల్ ద్వారా రైతులకు సాగునీరు తాగు నీరు ఉందని అన్నారు. ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని మరోసారి తెలియజేశారు. చంద్రబాబు పెట్టిన పథకాలలో సూపర్ సక్సెస్ అయినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మరియు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డ గత ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న బిల్లు లు మంజూరు కాలేనందుకు సర్పంచులు కష్టాల్లో ఉండి వారి సొంత భూమిని అమ్ముకొని సర్పంచ్ లు గెలిచిన తర్వాత సర్పంచ్ అకౌంట్ లోకి డబ్బులు వేయకుండా చేతులు ఎత్తేశారు. 2024 సంవత్సరంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత 19 నెలలకే పాత వైఎస్ఆర్ సర్పంచులకు వారి అకౌంట్లోకి నేరుగా డబ్బులు పడటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ ఉదయ్ కుమార్ గౌడ్ పేట గ్రామ అధ్యక్షులు సామెల్ నాగలదిన్నె కిషోర్ మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## కే. నాగలాపురంలో ముగ్గుల పోటీలు






మనగళం, గూడూరు : గూడూరు మండల పరిధిలోని కే. నాగలాపురం గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఉల్లాసంగా సాగాయి. గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేత మహిళలకు నగదు బహుమతులను ఎస్ఐ అఖిల్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. మొదటి బహుమతి రూ. 5 వేలను గోపాల్ రెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ. 3 వేలను బి. సుంకన్న, మూడవ బహుమతిని రూ. 2 వేలను బి. తిరుపాల్ అందజేశారు. ముగ్గుల పోటీలను యువ నాయకుడు బి. వెంకటేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జే. సురేష్, బండారి శ్రీనివాసులు, టి. సురేష్, టి. రామ్మోహన్, బి. సురేష్, బి. మహేష్, టి. మోహన్, టి. లక్ష్మన్న, టి. నవీన్, టి. రాముడు, బి. సురేష్, టి. పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# కనుమ సందర్భంగా గోపూజా మహోత్సవం





మనగళం శ్రీశైలం : కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈ రోజు (16.01.2026) గోపూజ మహోత్సవాన్ని నిర్వహించింది. ఆలయం ప్రాంగణములోని శ్రీ గోకులంలోనూ మరియు దేవస్థానం గో సంరక్షణశాలలోనూ ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ప్రతీనిత్యం ఆలయంలో ప్రాత:కాల సమయంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించబడుతున్నప్పటికీ, కనుమ పండుగ సందర్భంగా ఈ రోజు నిత్య గోసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడింది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ దేవకి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కె. సుధాకరరెడ్డి శ్రీ ఎ. శ్రీనివాసులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. ఈ విశేష కార్యక్రమములో ముందుగా ఆలయములోని శ్రీగోకులం వద్ద లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజాసంకల్పాన్ని పఠించారు. ఆ తరువాత పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకుగాను ముందుగా మహాగణపతి పూజ జరిపించబడింది. అనంతరం శ్రీసూక్తంతోనూ,గోఅష్టోత్తరమంత్రంతోనూ, గోవులకు షోడశ ఉపచారాలతో పూజాదికాలు జరిపించబడ్డాయి. గోవులకు మరియు గోవత్సాలకు (ఆవుదూడలకు) నూతన వస్త్రాలు సమర్పించడం జరిగింది. చివరగా గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించబడ్డాయి. ఆ తరువాత దేవస్థానం గో సంరక్షణశాలలోని శ్రీకృష్ణుని విగ్రహానికి పూజాదికాలను జరిపించడం జరిగింది. తరువాత వృషభాలకు, గోవులకు సంప్రదాయ బద్దంగా పూజాదికాలు జరిపి నూతన వస్త్రాలను సమర్పించారు. అదేవిధంగా ఈ విశేష కార్యక్రమములో వృషభాలకు కూడా సంప్రదాయబద్ధంగా పూజాదికాలతో గ్రాసం అందజేయబడింది. కాగా మన వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉంది. మన వేదాలు ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు మొదలైనవన్నీ కూడా గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొన్నాయి. గోవు సకల దేవతలకు ఆవాస స్థానం కావడం చేత గోవును పూజించడం వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా గోపూజను ఆచరించడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

శనివారం
17 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## పశు సంపదకు పూజ, రైతు జీవనానికి గౌరవం : కనుమ

సంక్రాంతి పండుగల పరంపరలో చివరి ఘట్టంగా వచ్చే కనుమ పండుగ తెలుగువారి గ్రామీణ సంస్కృతికి, రైతు జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుంది. భోగి, మకర సంక్రాంతి ద్వారా పంటల పండుగ ఆనందాన్ని ఆస్వాదించిన రైతు, కనుమ రోజున తన జీవితానికి ఆధారమైన పశు సంపదకు కృతజ్ఞతలు తెలుపుతాడు. ఇది కేవలం ఒక పండుగ కాదు, ప్రకృతి--మనిషి--జంతువు మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసే సామాజిక సందేశం.

రైతు జీవితంలో పశు సంపద పాత్ర అత్యంత కీలకం. ఒకప్పుడు వ్యవసాయం పూర్తిగా ఎద్దులు, ఆవులు, గేదెలపై ఆధారపడి సాగేది. పంట పొలాలు దున్నడం నుంచి పంట రవాణా వరకు ప్రతి దశలో పశువుల శ్రమ కీలకంగా ఉండేది. అందుకే కనుమ పండుగ రోజున పశువులకు స్నానం చేయించి, కొమ్ములకు రంగులు వేసి, పూలతో అలంకరించి, పూజించడం ద్వారా రైతు తన కృతజ్ఞతను వ్యక్తం చేస్తాడు. ఈ ఆచారం రైతు మనసులోని కష్టానికి గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

కనుమ పండుగ వ్యవసాయం కేవలం ఉపాధి మాత్రమే కాదని, అది ఒక జీవన విధానం అని బలంగా చెబుతుంది. నేటి కాలంలో వ్యవసాయం లాభనష్టాలతో కూడిన వృత్తిగా మారిపోయినప్పటికీ, కనుమ రైతుకు తన మూలాలను గుర్తు చేస్తుంది. భూమి, నీరు, పశు వులు, కష్టపడే చేతులు -- ఇవన్నీ కలిసినప్పుడే పంట పండుతుందన్న సత్యాన్ని ఈ పండుగ మనకు గుర్తు చేస్తుంది. ప్రకృతిని గౌరవిస్తేనే మన జీవనం నిలుస్తుందన్న సందేశం ఇందులో నిగూఢంగా దాగి ఉంది.

ఈ పండుగ సామాజిక బంధాలను బలోపేతం చేసే వేదిక కూడా. గ్రామాల్లో బంధువులు, స్నేహితులు, పొరుగువారు ఒకచోట చేరి కలిసి భోజనం చేయడం, సంప్రదాయ ఆటలు, వేడుకలు నిర్వహించడం ద్వారా ఐక్యత పెరుగుతుంది. పట్టణీకరణ పెరిగిన నేటి రోజుల్లో ఈ సంస్కృతి కొంత తగ్గినా, గ్రామీణ ప్రాంతాల్లో కనుమ ఇప్పటికీ ఉత్సాహంగా కొనసాగుతోంది. కొత్త తరానికి గ్రామీణ జీవన విలువలను పరిచయం చేసే రోజు కూడా ఇదే.

అయితే, కాలం మారుతున్న కొద్దీ కనుమ పండుగ సారాన్ని మనం ఎంతవరకు కాపాడుకుంటున్నామన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. యాంత్రికీకరణ పెరగడంతో పశు సంపదపై ఆధారపడటం తగ్గింది. రైతు జీవితంలో పశువుల ప్రాధాన్యం తగ్గిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనితో పాటు వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, పశు సంరక్షణపై నిర్లక్ష్యం వంటి సమస్యలు ఆలోచించాల్సినవే. కనుమ పండుగను కేవలం సంప్రదాయంగా జరుపుకోవడమే కాకుండా, రైతు సంక్షేమం, పశు సంరక్షణ, గ్రామీణాభివృద్ధిపై చర్చించే రోజుగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

కనుమ మనకు మరో ముఖ్యమైన పాఠాన్ని కూడా నేర్పిస్తుంది. మనిషి మాత్రమే కాదు, అతడితో పాటు జీవించే జంతువులు కూడా ఈ సమాజానికి భాగమే అన్న భావన. పశు సంపదను గౌరవించడం అంటే ప్రకృతిని గౌరవించినట్టే. నేటి కాలంలో పర్యావరణ సమస్యలు, వాతావరణ మార్పులు తీవ్రంగా ప్రభావితం చేస్తున్న తరుణంలో, కనుమ పండుగలోని ఈ తాత్వికత మరింత ప్రాసంగికంగా మారింది.

చివరగా చెప్పాలంటే, కనుమ పండుగ తెలుగువారి సంస్కృతిలో ఒక ఆచారం మాత్రమే కాదు, ఒక ఆలోచన. శ్రమకు గౌరవం, ప్రకృతితో సహజీవనం, పశు సంపద పట్ల కృతజ్ఞత, సామాజిక ఐక్యత -- ఇవే కనుమ పండుగ మనకు అందించే అసలైన సందేశాలు. ఆధునిక కాలంలో ఎంత ముందుకు వెళ్లినా, ఈ విలువలను కాపాడుకోవడమే మన సంస్కృతికి నిజమైన నివాళి. రైతు నిలబడితేనే సమాజం నిలుస్తుంది అన్న సత్యాన్ని ప్రతి కనుమ మనకు మళ్లీ మళ్లీ గుర్తు చేస్తూనే ఉండాలి. కనుమ పండుగ సామాజిక బంధాలను కూడా బలోపేతం చేస్తుంది. గ్రామాల్లో బంధువులు, స్నేహితులు కలుసుకుని కలిసి భోజనం చేయడం, సంప్రదాయ ఆటలు, వేడుకలు నిర్వహించడం ద్వారా ఐక్యత పెరుగుతుంది. పట్టణాల్లో ఈ సంస్కృతి కొంత తగ్గినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో కనుమ ఇప్పటికీ ఉత్సాహంగా జరుపుకుంటారు. ఇది కొత్త తరానికి గ్రామీణ సంప్రదాయాలను పరిచయం చేసే వేదికగా మారుతోంది.

అయితే, మారుతున్న కాలంలో కనుమ పండుగ సారాన్ని మనం కోల్పోతున్నామా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు తగ్గిపోవడం, యాంత్రికీకరణ పెరగడం, పశు సంపదకు ఇచ్చే ప్రాధాన్యం తగ్గిపోవడం వంటి అంశాలు ఆలోచించాల్సినవి. కనుమ పండుగను కేవలం సంప్రదాయంగా కాకుండా, రైతు సంక్షేమం, పశు సంరక్షణ, గ్రామీణాభివృద్ధిపై చర్చించే రోజుగా మలచుకోవాల్సిన అవసరం ఉంది. కనుమ పండుగ మనకు చెప్పే అసలు సందేశం స్పష్టమైనది. ప్రకృతితో సమన్వయం, శ్రమకు గౌరవం, పశు సంపద పట్ల కృతజ్ఞత, సామాజిక ఐక్యత -- ఇవే నిజమైన సంపదలు. ఆధునిక కాలంలో ఎంత ముందుకు వెళ్లినా, ఈ విలువలను మరిచిపోకపోవడమే కనుమ పండుగ అసలైన అర్థం. రైతు జీవితం నిలబడితేనే సమాజం నిలబడుతుందన్న సత్యాన్ని గుర్తు చేసే పండుగగా కనుమ ఎప్పటికీ నిలవాలి.

## షేక్ బాజీ వలి ఎంగేజ్మెంట్‌కు ఘన హాజరు -- పాల్గొన్న డాక్టర్ షేక్ మహబూబ్ వలి



మన గళం మార్కాపురం జిల్లా : తుమ్మల చెరువు గ్రామం, తర్లుపాడు మండలం, మార్కాపురం జిల్లాలో నిర్వహించిన షేక్ బాజీ వలి ఎంగేజ్మెంట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ భారతదేశ ఉపాధ్యక్షులు, సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, యోగ్దానం సహర సమితి, కార్పొరేషన్ ఫ్రీ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. షేక్ బాజీ వలి గత సంవత్సరం నుంచి సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ ప్రకాశం జిల్లా జనరల్ సెక్రటరీగా పదవిలో కొనసాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఇమ్రాన్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సయ్యద్ రఫీ, షేక్ యూనిస్, షేక్ మహబూబ్ వలి, షేక్ గౌస్ తదితరులు పాల్గొని షేక్ బాజీ వలి దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎంగేజ్మెంట్ వేడుక స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషుల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా ముగిసింది.

## క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణాన్ని పరిశీలించిన కమిటీ సభ్యులు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి మాత అమ్మవారి తిరుణాల సందర్భంగా ఫిబ్రవరి 1 వ తేదీ నుండి జరగబోయే శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న స్టేజి కు మరమ్మతులు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత వుందని సభ్యులు గుర్తించారు. అలాగే స్టేజి ప్రక్కన కూడా జేసీబీ తో పిచ్చి మొక్కలు తొలగించడం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. ఇందుకు కోడుమూరు గ్రామ పంచాయతీ సహకారం తీసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. స్టేజి విస్తీర్ణం కూడా పెంచి మరింత అందంగా తీర్చిదిద్దుకొని క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల వైభవంగా నిర్వహించుట కొరకు ఈ పరిసర ప్రాంతాలను సిద్ధం చేసుకోవాలని భావించారు ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో కోడుమూరు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## జనవరి 18న ఖమ్మంలో జరగబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

### – హలో కామ్రేడ్...చలో ఖమ్మం......సిపిఐ



మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు పట్టణంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహించబోతున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రాజు పిలుపునిచ్చారు స్థానిక గూడూరు పట్టణంలోని సిపిఐ నాయకులు ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రాజు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను వంద సంవత్సరాలు పూర్తి చేస్తున్న సందర్భంగా భారీ బహిరంగ సభ గ్రామీణ పట్టణ ప్రాంతాల నుంచి తరలిరావాలని వారన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని దేశంలో రైతులకు కార్మికులకు కర్షకులకు వ్యవసాయ కూలీలకు కొత్త కొత్త చట్టాలు తీసుకొచ్చి ప్రైవేట్ కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల గూడూరు కార్యదర్శి బీడీల శ్రీనివాసులు ఏఐటియుసి మండల అధ్యక్షుడు ఓబ్లేసు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు


## ఆదోని జిల్లా సాధించేవరకు పోరాటం సాగిస్తాం

### – ఈనెల 24 నా 5 నియోజకవర్గాల బంద్. – 36వ రిలే దీక్షల్లో దివ్యాంగులు.




( ఆలూరు మనగళం ): ఆదోనిను జిల్లాగా ప్రకటించే వరకు పోరాటం కు మద్దతుగా ఉంటామని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బంటన హాల్ నాగరాజు, పత్తికొండ డివిజన్ ఎం ఆర్ పి ఎస్ ఉపాధ్యక్షులు నరసప్ప అన్నారు. ఆలూరు జెఏసి అధ్వర్యంలో ఆదోని జిల్లా సాధన కోసం చేపడుతున్న రిలే దీక్ష శుక్రవారం కు 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో హాలహర్వి మండలం గుళ్యం,బాపురం గ్రామాల వికలాంగుల హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు నరసింహులు తో పాటూ పార్థన్న, వడ్డెర పాపారాయుడు, నారాయణప్ప, షేకప్ప, వనూర్ శెట్టి, నాగరాజు, సోమశేఖర్, పాపారాయుడు, ఉలిగప్ప కూర్చున్నారు. ఈ దీక్షల్లో జెఏసి నాయకులు కత్తి రామాంజినేయులు, భూపేష్, ఎల్లప్ప, పూల రామాంజినేయులు, చాంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదోని జిల్లా సాధన కోసం దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈనెల 24న ఆదోని జిల్లా సాధన కోసం ఐదు నియోజకవర్గాల బంద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. పాటలకు అతీతంగా రాజకీయ పార్టీలు విద్యార్థ సంఘాలు కుల సంఘాలు, వ్యాపార వర్గాలు జిల్లా సాధన ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



మనగళం శ్రీశైలం : మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అయిదవ రోజైన (16.01.2026) ఈ రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. ఉత్సవాలలో భాగంగానే యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోకకల్యాణంకోసం జపాలు, పారాయణలు చేయడం జరిగింది. తరువాత మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం కార్యక్రమాలను ఆగమశాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. అదే విధంగా ఈ సాయంకాలం ప్రదోషకాలపూజలను, హోమాలను జరిపించిన తరువాత జపానుష్టానాలు జరిపించబడతాయి. రావణ వాహన సేవ ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా ఈ రోజు సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు రావణ వాహనసేవ జరిపించబడుతుంది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకారమండపంలో రావణవాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడతాయి. తరువాత పురవీధులలో గ్రామోత్సవం జరిపించబడుతుంది. గ్రామోత్సవములో జానపద కళారూపాల ప్రదర్శన, కోలాటం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి.

రేపటి కార్యక్రమాలు మకరసంక్రాంతి సందర్భంగా రేపు (17.01.2026) ఉదయం శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాల పూజల అనంతరం ఉదయం గం. 8.45 ల నుండి శ్రీస్వామివారి యాగశాలలో పూర్ణాహుతి అవబృదం, కలశోద్వాసన, వసంతోత్సవం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, విశేషార్చనలు జరుగుతాయి. సాయంత్రం గం.6.00ల నుండి సదస్యమ్, నాగవల్లి, రాత్రి గం.7.30లకు ధ్వజావరోహణ కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.

# పార్థివ దేహానికి నివాళులు

**- అర్పించిన, ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి సోదరుడు శ్రీరాములు**



( ఆలూరు మనగళం ): బళ్ళారి జిల్లా, హాగిరి గ్రామంలో చిప్పగిరి గ్రామవాసి కురువ బసవరాజు సతీమణి కురువ ఉల్తెమ్మ ఆనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి సోదరుడు బుసినే శ్రీరాములు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కురువ బసవరాజు కుటుంబన్ని ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొనారు.

# వాల్మీకి మహర్షి నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన, వాల్మీకి నాయకులు



( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో ఆర్ అండ్ బి అధితి గృహంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలూరు గెస్ట్ హౌస్ నందు వాల్మీకి సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఆలూరు పెద్దలు రిటైర్డ్ ఎమ్మార్వో మాదన్న, రిటైర్డ్ పోస్టల్ తిమ్మప్ప,

సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ నెట్టప్ప, వాల్మీకి నాయకులు కృష్ణ, అరికెర ఆంజనేయ, వాల్మీకి లోకేష్ ఆలూరు నియోజకవర్గం బిసి సంఘం అధ్యక్షుడు పత్తికొండ వాల్మీకి నాయకులు శేషయ్య, వీరాంజనేయులు. ఈ కార్యక్రమానికి పాల్గొనడం జరిగింది.

# ఎమ్మెల్యే ను పరామర్శించిన హాలహర్వి వైసీపీ నాయకులు



( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు భూసినే విరుపాక్షి ను శుక్రవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి, అలాగే సంక్రాతి శుభాకాంక్షలు తెలియజేసారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే గారు హైదరాబాద్‌లో మోకాలికి సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకుని, కొంతకాలం విశ్రాంతి అనంతరం ప్రస్తుతం చిప్పగిరి మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హాలహర్వి మండలం వైస్ ఎంపీపీ నాగేష్. అలాగే ఎమ్మెల్యే వీరుపాక్షి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హలహార్వి మండలంలో పలు అభివృద్ధి పనుల గురించి కూడా నాయకులు ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ మండల సీనియర్ నాయకులు దిబ్బలింగ, వాల్మీకి భాస్కర్, తిమ్మప్ప, శీను, చిదనంద, బాబు అనిల్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనతా వారధి

**- బిజెపి బనగానపల్లి మాజీ కన్వీనర్ బి వి సుబ్బారెడ్డి**




మన గళం బనగానపల్లె : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనతా వారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ బనగానపల్లె మాజీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి శుక్రవారం అన్నారు. బనగానపల్లెలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్ పిలుపు మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు సూచన మేరకు కార్యాలయంలో మండలాధ్యక్షులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సేవ చేయాలని సీనియర్ నాయకులు బీవీ సుబ్బారెడ్డి అన్నారు .

బనగానపల్లె భారతీయ జనతా పార్టీ ఆఫీసు నందు

జనతా వారథి కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొని స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి మీ యొక్క ప్రతిపాదనను వారికి సమర్పించి ప్రతి శుక్రవారం మీరు మీ సమస్యలను మా నాయకుల ద్వారా తెలియజేసుకొని సమస్య పరిష్కారం చేసుకోవాలని బివి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు మద్దిలేటి భారతీయ జనతా పార్టీ యువజన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెర్సిడెస్ మేబ్యాక్ జీఎల్ఎస్ విడుదల..

న్యూఢిల్లీ -- జనవరి 16 -- మనగళం : : మెర్సిడెస్ బెంజ్ సంస్థ తన లగ్జరీ వాహనం మేబ్యాక్ జీఎల్ఎస్‌ను భారతదేశంలో స్థానికంగా అసెంబుల్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ మోడల్ ధరను రూ. 2.75 కోట్లుగా ప్రకటించింది. గతంలో పూర్తిగా దిగుమతి చేసిన వాహనం ధర రూ. 3.17 కోట్లుగా ఉండేది. స్థానిక అసెంబ్లీ వల్ల దిగుమతి పన్నులు తగ్గడంతో దాదాపు రూ. 42 లక్షల వరకు ధర తగ్గినట్లు కంపెనీ తెలిపింది. అదే విధంగా రూ. 4.10 కోట్ల ధరతో ప్రత్యేక ఎడిషన్‌ను కూడా విడుదల చేసింది. స్థానికంగా తయారీ జరగడం వల్ల వినియోగదారులకు వాహనం త్వరగా అందుబాటులోకి వస్తుందని, బుకింగ్ చేసిన వారికి వేగంగా డెలివరీ చేయడం సాధ్యమవుతుందని సంస్థ పేర్కొంది.

# ప్రపంచ థైరాయిడ్ అవగాహన దినోత్సవం

డెస్క్, జనవరి 16 మనగళం : నేటి వేగవంతమైన జీవనశైలి, ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడుల కారణంగా థైరాయిడ్ సంబంధిత వ్యాధులు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే, ఈ వ్యాధి చాలా సందర్భాల్లో ప్రారంభ దశలో ఎలాంటి తీవ్రమైన లక్షణాలు చూపకపోవడంతో ప్రజలు దీన్ని తేలికగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో థైరాయిడ్ వ్యాధులపై అవగాహన పెంచడం, ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యతను తెలియజేయడం కోసం ప్రతి సంవత్సరం జనవరి 17న ప్రపంచ థైరాయిడ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

థైరాయిడ్ అనేది మన మెడ ముందు భాగంలో ఉండే చిన్న కానీ అత్యంత కీలకమైన గ్రంథి. ఇది శరీరంలో హార్మోన్ల సమతుల్యతను నియంత్రిస్తూ శక్తి వినియోగం, బరువు నియంత్రణ, గుండె స్పందన, శరీర ఉష్ణోగ్రత, మానసిక స్థితి వంటి అనేక అంశాలపై ప్రభావం చూపుతుంది. థైరాయిడ్ గ్రంథి అవసరానికి మించి లేదా తక్కువగా హార్మోన్లు విడుదల చేస్తే హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇవి వ్యక్తి రోజువారీ జీవన విధానాన్ని పూర్తిగా ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటాయి.

ప్రారంభ దశలో అలసట, బరువు పెరగడం లేదా తగ్గడం, జుట్టు రాలడం, చర్మం పొడిబారడం, గుండె వేగంగా కొట్టుకోవడం, మానసిక అస్థిరత వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది వీటిని సాధారణ ఆరోగ్య సమస్యలుగా భావించి వైద్యులను సంప్రదించరు. అయితే నిర్లక్ష్యం చేస్తే గర్భధారణ సమస్యలు, గుండె జబ్బులు, మధుమేహం, మానసిక ఆరోగ్య సమస్యలు వంటి తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. అందుకే థైరాయిడ్ సమస్యలను తేలికగా తీసుకోవడం ప్రమాదకరం అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రపంచ థైరాయిడ్ అవగాహన దినోత్సవం ప్రధానంగా ముందస్తు నిర్ధారణే ఉత్తమ రక్షణ అని నొక్కి చెబుతుంది. సాధారణ రక్త పరీక్షల ద్వారా థైరాయిడ్ స్థాయిని సులభంగా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా మహిళలు, గర్భిణీలు, కుటుంబ చరిత్ర ఉన్నవారు, దీర్ఘకాలంగా అలసట లేదా అకారణ బరువు మార్పులు ఎదుర్కొంటున్న వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సమయానికి గుర్తిస్తే మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చు.

థైరాయిడ్ సమస్యలను నియంత్రించడంలో ఆరోగ్యకరమైన జీవనశైలికీ కీలక పాత్ర ఉంది. సమతుల ఆహారం, అయోడిన్ కలిగిన ఆహార పదార్థాలు, క్రమమైన వ్యాయామం, యోగ, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవడం అవసరం. స్వీయ వైద్యం చేయకుండా, వైద్యుల సూచనలతోనే చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యం. సరైన అవగాహన, సమయానికి పరీక్షలు, క్రమమైన చికిత్స ఉంటే థైరాయిడ్ ఉన్నా కూడా సాధారణ జీవితం సజావుగా కొనసాగించవచ్చని ఈ దినోత్సవం సమాజానికి గుర్తు చేస్తోంది.

శనివారం
17 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# 9 నెలల్లో దూసుకెళ్లిన దేశ ఎగుమతులు..



న్యూఢిల్లీ -- జనవరి 16 -- మనగళం : 2025--26 ఆర్థిక సంవత్సరంలో దేశ ఎగుమతులు స్థిరమైన వృద్ధితో ముందుకు సాగుతున్నాయి. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు జరిగిన తొలి 9 నెలల్లో దేశం మొత్తం 634 డాలర్ల విలువైన ఎగుమతులను నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ కాలంలో 4.33 శాతం వృద్ధి సాధించినట్లు వాణిజ్య శాఖ ప్రాథమిక గణాంకాలు వెల్లడించాయి.

వస్తువుల ఎగుమతులు మాత్రమే లెక్కలోకి తీసుకుంటే ఈ 9 నెలల్లో 330 డాలర్ల స్థాయికి చేరాయి. ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ కొనసాగడం, దేశంలో తయారీ సామర్థ్యం పెరగడం వల్ల ఈ పురోగతి సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ ఎగుమతుల్లో ధాన్యాలకు ముఖ్యమైన వాటా లభించింది. ముఖ్యంగా బియ్యం, గోధుమలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. అలాగే విద్యుత్ పరికరాల రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ, చేతి ఫోన్లు, ఇతర పరికరాల ఎగుమతుల్లో మంచి వృద్ధి చూపిస్తోంది. జీడిపప్పు, మాంస ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు కూడా మొత్తం ఎగుమతుల్లో కీలక పాత్ర పోషించాయి.

దేశాల వారీగా చూస్తే అమెరికా, చైనా, అరబ్ ఎమిరేట్స్, స్పెయిన్, హాంకాంగ్ దేశాలు ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలుగా నిలిచాయి. ఈ దేశాల నుంచి కొనసాగుతున్న ఆర్డర్లు దేశ ఎగుమతి రంగానికి బలాన్ని ఇస్తున్నాయి. మౌలిక వసతుల అభివృద్ధి, తయారీ రంగంలో పెట్టుబడులు, ఎగుమతులకు అనుకూలమైన విధానాలు కొనసాగితే రాబోయే నెలల్లో కూడా దేశ ఎగుమతులు మరింత వృద్ధి సాధించే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# గ్యాడ్జెట్ ప్రియులకు బిగ్ అలర్ట్..





హైదరాబాద్ -- జనవరి 16 -- మనగళం : రాబోయే రెండు మూడు నెలల్లో స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మెమరీ చిప్‌ల కొరత ఏర్పడటం, అధిక పనితీరు అవసరమయ్యే ఆధునిక సాంకేతిక వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ఇప్పటికే గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో గాడ్జెట్‌ల ధరలు సుమారు 21 శాతం వరకు పెరిగాయి. ఇప్పుడు మరోసారి 4 నుంచి 8 శాతం వరకు పెరుగుదల ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

టెలివిజన్లపై పన్ను తగ్గించినప్పటికీ, స్మార్ట్‌ఫోన్‌లు మరియు ల్యాప్‌టాప్‌లపై పన్నుల్లో మార్పులు లేవు. అయినప్పటికీ ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల వినియోగదారులపై భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెమరీ చిప్‌ల తయారీ తగ్గడంతో వాటి ధరలు పెరుగుతున్నాయని, దీని ప్రభావం అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలపై పడుతోందని నిపుణులు చెబుతున్నారు. పండుగల సీజన్ ముగిసిన తర్వాత సాధారణంగా డిమాండ్ తగ్గినా, ఈసారి తయారీ వ్యయం పెరగడం వల్ల ధరలు తగ్గే అవకాశం తక్కువగా ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. కొన్నిబ్రాండ్లు ఇప్పటికే ధరలు పెంచగా, మరికొన్ని రాయితీలు తగ్గిస్తూ వినియోగదారులపై భారం మోపుతున్నట్లు సమాచారం. వచ్చే నెలల్లో కూడా మెమరీ చిప్‌ల ధరలు పెరుగుతూనే ఉంటాయని అంచనాలు ఉన్నాయి. అయితే కొన్ని భాగాల ధరలు తగ్గితే కొంతమేర ఊరట లభించే అవకాశముందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా చూస్తే, గాడ్జెట్‌లు కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగానే నిర్ణయం తీసుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# పుచ్చకాయ నిల్వ ఉంచితే ప్రమాదమా?



హైదరాబాద్ -- జనవరి 16 -- మనగళం : పుచ్చకాయ.. ప్రస్తుతం రోడ్డు మీద వెళ్తున్న షాపింగ్ చేస్తున్న ఇంటి దగ్గర ఉన్న ఇలా ఎక్కడ ఉన్నా కళ్ళ ముందు కనిపించే పండు. వేసవికాలం వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరి కన్ను పుచ్చకాయ పైన పడుతుంది.ఇక ఈ పండులో అటు 90% నీరు ఉంటుంది. దీంతో మండు టెండల నుంచి ఇక ఈ పండు తినడం ద్వారా ఉపశమనం పొందాలని అందరూ అనుకుంటూ ఉంటారు. అయితే ఇందులో విటమిన్ ఏ, విటమిన్ బి, విటమిన్ సి తో పాటు క్లోరిన్, బీటా కెరోటిన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కూడా చాలానే ఉంటాయి ఇక ఇవన్నీ ఎండ తాపం నుంచి రక్షణ కల్పిస్తూ ఉంటాయి అన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా తరచూ ఎండల్లో తిరుగుతూ ఉండేవారు ఇక పుచ్చకాయ తినడం వల్ల డిహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే వడదెబ్బ తగలకుండా ఈ పండు అటు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేస్తూ ఉంటుంది అని చెప్పాలి. అంతేకాకుండా ఇక ఎండాకాలంలో వచ్చే ఎన్నో చర్మ రోగాలు కూడా పుచ్చకాయ తినడం వల్ల తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతూ ఉంటారు. దీంతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరికీ అందుబాటు ధరలో ఉండే ఈ పుచ్చకాయను కొనుగోలు చేసి ప్రతిరోజు తినడం ఒక అలవాటుగా మార్చుకుంటూ ఉంటారు ప్రతి ఒక్కరు. అయితే తరచూ మార్కెట్ కు వెళ్లి ఎందుకు పుచ్చకాయ కొనడం అని భావించి.. కొంతమంది ఇక పుచ్చకాయను కొనుగోలు చేసి ఇంట్లో ఫ్రిడ్జ్ లో భద్రపరుచుకుని తినడం చేస్తూ ఉంటారు. పుచ్చకాయ పెద్ద ఆకారంలో ఉంటుంది కాబట్టి కుటుంబ సభ్యులందరూ తిన్న కూడా ఇంకా మిగిలి ఉంటుంది. దీంతో దానిని ఫ్రిడ్జ్ లో భద్రపరచడం చేస్తూ ఉంటారు. ఇలా చేస్తే ప్రమాదంలో పడినట్లే అని హెచ్చరిస్తున్నారు నిపుణులు ఫ్రిడ్జ్ లో పుచ్చకాయను భద్రపరచడం వల్ల అందులోని పోషకాలు నశించే అవకాశం ఉంటుంది. 90 శాతం నీరు కలిగిన పుచ్చకాయని ఫ్రిడ్జ్ లో పెడితే అందులోని శీతల ఉష్ణోగ్రత పండు పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందట. ఇక కట్ చేసిన పుచ్చకాయలో వేగంగా బ్యాక్టీరియా ఏర్పడుతుందని నిపుణులు అంటున్నారు. అలా బ్యాక్టీరియా ఏర్పడిన పండు తింటే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం కూడా ఉంటుందట. అందుకే ఇక పుచ్చకాయను ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా త్వరగా తినేయడం మంచిది అని చెబుతున్నారు నిపుణులు.

# మొలకెత్తిన శనగల్ని తినడం వల్ల ఈ సమస్యలన్నీ పరార్..!




హైదరాబాద్ -- జనవరి 16 -- మనగళం : పూర్వపు రోజుల నుంచి ఇప్పటి వరకు పప్పు ధాన్యాలకు ప్రత్యేకమైన స్థానం ఉన్నది.. ఇందు లో ముఖ్యంగా శనగలు ఆరోగ్యానికి చాలా మంచి చేస్తాయి.. నల్ల శనగలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి..అయితే శనగలను నానబెట్టి మరి ఉడికించిన తర్వాత తినడం వల్ల ఇందులో ఉండేటువంటి మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలతో పాటు విటమిన్స్, మాంగనీస్, మినరల్స్ వంటివి పుష్కలంగా లభిస్తాయి.. అందుకే ఈ శనగలను తినడం వల్ల చాలా లాభాలను కలిగి ఉన్నాయి.షుగర్ ఉన్నవారికి మొలకెత్తిన శనగలు తినడం వల్ల ఇందులో ఉండే ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు గ్లైసోమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది.. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ కూడా కంట్రోల్ లో ఉంచేలా చేస్తాయి. ఇమ్యూనిటీని పెంచడానికి ఈ మొలకెత్తిన శనగలు ఉపయోగపడతాయి.. వీటిని తీసుకోవడం వల్ల ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ పెద్ద ప్రేమ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని సైతం తగ్గిస్తాయి.చర్మ సమస్యలతో ఇబ్బంది పడే వారికి ఈ మొలకెత్తిన శనగలు చాలా ఉపయోగపడతాయి.. ఇందులో మాంగనీసం ఉండడం వల్ల ముడతలు వృద్ధాప్య లక్షణాలు కూడా దూరం చేస్తాయి.ఈ శనగలను మొలకెత్తిన తర్వాత మనం జ్యూస్ గా చేసుకొని తినడం వల్ల మంచి లాభాలు ఉంటాయి.. శనగలను ఉడికించిన తర్వాత.. కాస్త నిమ్మరసం ఉల్లిపాయ ముక్కలను ఉప్పు కారం వేసుకుని తినడం వల్ల చాలా టేస్టీగా ఉంటాయి.. రోజుకి కొన్ని గుప్పెడు శనగలను తినడం వల్ల చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుతాయి.శనగలు తినడం వల్ల హైబీపీ తగ్గడంతో పాటు గుండె జబ్బులు రాకుండా చేస్తాయి..సెనగలను పొట్టుతో ఉన్న శనగలను తినడం వల్ల చాలా మంచిది.. అయితే వీటిని అధికంగా తింటే మాత్రం కడుపు ఉబ్బరంగా కనిపిస్తుంది. అందుకే తక్కువ మోతాదులలో వీటిని తినడం మరింత మంచిది.

# రాగులతో చేసిన పదార్థాలు తింటున్నారా!

హైదరాబాద్ -- జనవరి 16 -- మనగళం : ఎసమ్మర్ పూర్తిగా రాకముందే ఎండలు భగ్గుమంటున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ ఏడాది మార్చిలోనే భానుడి భగభగలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉక్కపోతతో పాటు వడదెబ్బతో బాధపడుతున్నారు. ఈ ఎండ కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోవడం కూడా సంభవిస్తుంది. ముఖ్యంగా ఊబకాయం, హైబీపీ, డీహైడ్రేషన్, వంటి సమస్యలు ఉన్నవారికి ఈ ఎండ వల్ల ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో చాలామంది శరీరాన్ని చల్లపరుచుకునేందుకు పలు పానీయాలను సేవిస్తుంటారు. ముఖ్యంగా చాలా మంది రాగి జావ ఆరోగ్యానికి మంచిదని ప్రాధాన్యతను ఇస్తుంటారు. అయితే రాగి జావ లోని పోషకాలు ఆరోగ్యానికి ప్రయోజనాలను కలిగిస్తాయని అందరికీ తెలిసిన విషయమే. ఇందులో ప్రోటీన్స్, ఫైబర్, కాల్షియం, పొటాషియం, పుష్కలంగా ఉండి మంచి ఫలితాలను అందిస్తాయి. అయితే రాగులతో చేసిన పదార్థాల వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఈ అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీసుకోవడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.లిమూత్రపిండాల్లో రాళ్ల తో బాధపడేవారు రాగులను తినకూడదు. ఇది శరీరంలో ఆక్సాలిక్ యాసిడ్‌ను పెంచి సమస్యను తీవ్రతరం చేస్తుంది.అలాగే థైరాయిడ్ వ్యాధితో బాధపడేవారు రాగులతో చేసినవి తినడం హానికరం. రాగులు థైరాయిడ్ గ్రంథి పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి. జీర్ణశయ సమస్యలు ఉన్నవారు, వాపు, అజీర్తి, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు ఉన్నవారు రాగులకు దూరంగా ఉండటం మంచిది. రాగులను అధికంగా తీసుకోవడం వల్ల డయేరియా, గ్యాస్ వంటివి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. రాగితో చేసే వీటిలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం ఉన్నవారు వీటిని తీసుకోకుండా ఉండడం ఆరోగ్యానికి మేలు. ముఖ్యంగా కొందరు అనోరెక్సియా తో బాధపడుతున్న వారు (ఆకలి లేకపోవడం) రాగులను తినడం అంత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే రాగులతో చేసినవి తింటే ఎక్కువ సేపు ఆకలిని కలిగించదు. ముఖ్యంగా బరువు పెరగాలనుకొనే వారు రాగులను తినకుండా ఉండటం మంచిది.

# ముక్కుతోనే ఎందుకు ఊపిరి పీల్చుకోవాలి ?



హైదరాబాద్ -- జనవరి 16 -- మనగళం : సాధారణంగా మనిషి చేసే చర్యలను బట్టి తాను ఆరోగ్యంగా ఉన్నాడా లేదా అన్న విషయాలను తెలుసుకోవచ్చు. అలాగే ఊపిరి పీల్చుకునే విధానాన్ని బట్టి కూడా ఆరోగ్యంగా ఉన్నారా లేదా అనారోగ్యంగా ఉన్నారా తెలుసుకోవచ్చు.సాధారణంగా ప్రతిఒక్కరూ ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటారు. అప్పుడప్పుడు కొంతమంది నోటి ద్వారా కూడా శ్వాస తీసుకునేవారు ఉన్నారు. అయితే ఇటీవలి పరిశోధనలో తెలిపిన అధ్యయనాల్లో 61 శాతం మంది ప్రజలు నోటి ద్వారా శ్వాస తీసుకుంటారని తెలిపారు. నోటి ద్వారా శ్వాస తీసుకోవడం సాధారణమే అయినప్పటికీ ముక్కు ద్వారా శ్వాస తీసుకోవాలని పెద్దలు, ఆరోగ్య నిపుణులు చెప్పడం చాలా సార్లు వినే ఉంటాం. మరి ఈ విషయాల పై అధ్యయనాలు ఎలాంటి నిజాలను బయటపెడుతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. శ్వాసకోశ వ్యవస్థ ముక్కు, నోటి నుండి మొదలవుతుంది. ఇది శ్వాసనాళాల ద్వారా, ఊపిరితిత్తుల ద్వారా కలుస్తుంది. ఇది శరీరంలో ఆక్సిజన్ ప్రవాహాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది. ముక్కు, నోరు శ్వాస తీసుకోవడానికి రెండు మార్గాలుగా ఉపయోగపడతాయి. అయితే ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ, రెగ్యులేటరీ, ఇంటిగ్రేటెడ్, కంపారిటివ్ ఫిజియాలజీలో ప్రచురించిన ఒక పరిశోధన ప్రకారం శ్వాస విధానం అనేది రక్తపోటు, హృదయ స్పందన రేటును ప్రభావితం చేస్తుందని వెల్లడైంది. నోటి ద్వారా కాకుండా ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటే రక్తపోటు అదుపులో ఉండి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని ఈ పరిశోధనలో తేలింది. ఈ అధ్యయనం చేసేందుకు 20 మంది ఆరోగ్యవంతులైన యువకులను తీసుకున్నారు. వారు విశ్రాంతి తీసుకునేటప్పుడు, వ్యాయామం చేసేటప్పుడు వారి ముక్కు లేదా నోటి ద్వారా మాత్రమే శ్వాస తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశోధనలో ప్రతి సెషన్‌లో ప్రజల రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, హృదయ స్పందన రేటును కొలిచారు. ప్రజలు విశ్రాంతి తీసుకునేటప్పుడు వారి ముక్కు ద్వారా ఊపిరి పీల్చుకుంటే వారి రక్తపోటు తక్కువగా ఉండి, హృదయ స్పందన రేటు కూడా మెరుగుపడుతుందని తెలిసిందన్నారు. విశ్రాంతి సమయంలో ముక్కు ద్వారా శ్వాస తీసుకునేటప్పుడు నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ఎక్కువగా ప్రజలు ఏదైనా బరువులు ఎత్తినప్పుడు, మెట్లు ఎక్కినప్పుడు, పరిగెత్తినప్పుడు లేదా వ్యాయామం చేసినప్పుడు నోటి ద్వారా శ్వాస తీసుకోవడం ప్రారంభిస్తారు. ఎందుకంటే ఆ సమయంలో గుండె చప్పుడు వేగంగా మారుతుంది. అందువల్ల నోటి ద్వారా శ్వాస తీసుకోవడం చాలా సాధారణం. కానీ వర్కవుట్స్ చేసేటప్పుడు కూడా ముక్కు ద్వారా మాత్రమే శ్వాస తీసుకోవాలని చెబుతారు. వ్యాయామం చేసేటప్పుడు ముక్కు లేదా నోటి ద్వారా శ్వాస తీసుకోవడంలో తేడా ఉండదని అధ్యయనాలు చెబుతున్నాయి.

## 'మన శంకర వరప్రసాద్ గారు' నాలుగు రోజుల్లో రికార్డు దూకుడు..



హైదరాబాద్ -- 16 -- మనగళం : మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయంతో దూసుకుపోతోంది. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కేవలం నాలుగు రోజుల్లోనే రూ.190 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సంక్రాంతి పండుగ సీజన్‌లో మరో భారీ హిట్‌ను చిరంజీవి ఖాతాలో వేసుకున్నారని సినీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ యాక్షన్ వినోదాత్మక చిత్రంలో నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో మెప్పించారు. కథ, వినోదం, భావోద్వేగాల సమ్మేళనం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. తొలి షో నుంచే సానుకూల స్పందన రావడంతో థియేటర్లకు ప్రేక్షకుల రాక భారీగా పెరిగింది.

ప్రత్యేకంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో సినిమా చూసేందుకు వస్తుండటం కలెక్షన్లకు మరింత ఊపునిస్తోంది. ఉదయం నుంచి రాత్రివరకు హౌస్ ఫుల్ ప్రదర్శనలు కొనసాగుతుండగా, టికెట్ కౌంటర్ల వద్ద సందడి కనిపిస్తోంది. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం ఈ రోజు ముగిసేలోపే సినిమా రూ.200 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

చిరంజీవి ఎనర్జీ, కామెడీ టైమింగ్, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు బలంగా మారాయి. సంక్రాంతి సెలవుల ప్రభావంతో వచ్చే కొన్ని రోజులు కూడా కలెక్షన్లు స్థిరంగా కొనసాగుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద 'మన శంకర వరప్రసాద్ గారు' మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్‌పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది.

## ధనుష్ ప్రేమకథకు డిజిటల్ వెలుగు..



హైదరాబాద్ -- 16 -- మనగళం : ధనుష్ హీరోగా, కృతి సనన్ హీరోయిన్‌గా నటించిన హృద్యమైన ప్రేమకథ చిత్రం 'తేరే ఇష్క్ మే' త్వరలో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గత ఏడాది నవంబర్‌లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం కథ, నటన, సంగీతంతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని నమోదు చేసింది.

థియేటర్ ప్రదర్శన పూర్తికావడంతో ఇప్పుడు డిజిటల్ వేదికపైకి అడుగుపెట్టనుంది. జనవరి 23 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుందని సమాచారం. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు, మరోసారి ఆస్వాదించాలనుకునే అభిమానులు ఈ వార్తతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ధనుష్ నటనలోని సహజత్వం, కృతి సనన్ అందించిన భావోద్వేగ ప్రదర్శన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. హృద్యమైన పాటలు, మృదువైన సంగీతం కథకు మరింత లోతు ఇచ్చాయి. ఓటీటీ విడుదలతో ఈ చిత్రం మరింత విస్తృతమైన ప్రేక్షక లోకానికి చేరుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రేమ, అనుభూతులు, సంబంధాల విలువను ఆవిష్కరించే ఈ సినిమా డిజిటల్ ప్రేక్షకులను కూడా అదే స్థాయిలో ఆకట్టుకుంటుందన్న నమ్మకం వ్యక్తమవుతోంది.

## నెట్‌ఫ్లిక్స్‌లో పవర్ స్టార్ మాస్ దండయాత్ర..

హైదరాబాద్ -- 16 -- మనగళం : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా, దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్‌పై అభిమానుల్లో అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గబ్బర్ సింగ్ కలయిక తర్వాత మళ్లీ ఈ కాంబినేషన్ రావడంతో ఫ్యాన్స్‌లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకుని వేగంగా పూర్తి చేస్తున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన మరో పెద్ద అప్‌డేట్ ఇప్పుడు బయటకు వచ్చింది. థియేటర్లలో విడుదలైన తర్వాత ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసిన తాజా జాబితాలో ఉస్తాద్ భగత్ సింగ్ మొదటి స్థానంలో ఉండడం పవన్ అభిమానులకు పండుగ వాతావరణాన్ని తెచ్చింది. ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో కూడా స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

సినిమాలో పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని స్టైల్‌లో కనిపించనున్నారని, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో అభిమానులను అలరించనున్నారని ప్రచారం జరుగుతోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన తెచ్చుకున్నాయి. థియేటర్లలో భారీ ఓపెనింగ్స్‌తో పాటు ఓటీటీలో కూడా ఈ చిత్రం సంచలనం సృష్టించనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి




## చిన్నస్వామిలో కృత్రిమ మేధ కెమెరాలు..



బెంగళూరు -- 16 జనవరి -- మనగళం : ఒకప్పుడు మ్యాచ్‌లతో కోలాహలంగా కనిపించిన చిన్నస్వామి స్టేడియానికి పూర్వ వైభవం తీసుకురావాలని కర్నాటక క్రికెట్ సంఘం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. స్టేడియంలో భద్రతను మరింత బలోపేతం చేసి మళ్లీ మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి పొందాలనే లక్ష్యంతో కొత్త ప్రణాళికలను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో అభిమానుల రద్దీని నియంత్రించేందుకు, ప్రమాదాలు జరగకుండా చూడేందుకు కృత్రిమ మేధతో పనిచేసే ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

గత సంవత్సరం జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంతో స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణపై నిషేధం విధించారు. భద్రతాపరమైన లోపాల కారణంగా అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి అక్కడ ఒక్క మ్యాచ్ కూడా జరగలేదు. ఇటీవల జరిగిన దేశీయ టోర్నీలకు కూడా ఈ మైదానం అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో కొత్త కార్యవర్గం భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

తొక్కిసలాట ఘటనపై విచారణ చేసిన ఏకసభ్య కమిషన్, ముందుగా ప్రేక్షకుల భద్రతకు పక్కా చర్యలు తీసుకోవాలని సూచించింది. అందులో భాగంగా స్టేడియం మొత్తం 300 నుంచి 350 కృత్రిమ మేధ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కెమెరాల ద్వారా ప్రేక్షకుల కదలికలను పర్యవేక్షించి తోపులాటలు జరగకుండా నియంత్రించడంతో పాటు, లోపలికి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో క్యూలు సక్రమంగా కొనసాగించేలా చర్యలు చేపట్టనున్నారు.

ఈ మొత్తం వ్యవస్థ ఏర్పాటు కోసం సుమారు రూ.4.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. భద్రతా ప్రమాణాలు పూర్తిగా అమలయ్యాక మాత్రమే మ్యాచ్‌లకు అనుమతి లభిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. త్వరలోనే సంబంధిత సంఘం నుంచి తుది నిర్ణయం వెలువడనుంది. అనుమతి లభిస్తే చిన్నస్వామి మళ్లీ ప్రేక్షకులతో కళకళలాడనుంది. అనుమతి రాకపోతే ఇతర నగరాల్లో మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలపై ఆలోచన జరుగుతోంది.

## మొన్న అవమానం.. నిన్న ఘన ప్రతీకారం!!



ముంబై -- 16 జనవరి 2026 -- మనగళం : మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ జట్టు తరఫున ఆడుతున్న హర్లీన్ డియోల్‌కు రెండు రోజుల్లోనే విభిన్న అనుభవాలు ఎదురయ్యాయి. ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆమె 36 బంతుల్లో 47 పరుగులు చేసినప్పటికీ, పరుగుల వేగం తక్కువగా ఉందని భావించిన జట్టు మేనేజ్‌మెంట్ ఆమెను మైదానం నుంచి వెనక్కి పిలిచింది. ఈ నిర్ణయం అభిమానులు, క్రీడాభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. మహిళల క్రికెట్‌లో ఇలాంటి ఘటనలు అరుదుగా కనిపించడంతో పెద్ద చర్చకు దారితీసింది.

అయితే ఆ నిరాశను హర్లీన్ గుండెల్లో దాచుకోలేదు. ముంబై జట్టుతో జరిగిన తదుపరి మ్యాచ్‌లో బ్యాటుతో అద్భుతంగా స్పందించింది. కేవలం 39 బంతుల్లో 64 పరుగులు చేసి జట్టును విజయం దిశగా నడిపించింది. ధైర్యమైన షాట్లు, చక్కటి టైమింగ్‌తో మైదానమంతా హోరెత్తించింది. ఈ ఇన్నింగ్స్‌తో ఆమె ఉత్తమ క్రీడాకారిణి అవార్డును కూడా దక్కించుకుంది.

ఒక్క మ్యాచ్‌లో ఎదురైన అవమానాన్ని మరుసటి రోజే ఘన విజయంగా మార్చుకోవడం హర్లీన్ మానసిక బలాన్ని స్పష్టంగా చూపించింది. విమర్శలకు మాటలతో కాకుండా ఆటతోనే సమాధానం ఇవ్వాలన్న ఆమె సంకల్పం యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తోంది. తాత్కాలిక పరాజయాలు శాశ్వతం కాదని, సరైన అవకాశం దొరికితే ప్రతిభ ఎలా మెరిసిపోతుందో హర్లీన్ ఆట మరోసారి నిరూపించింది.

## యాషెస్ హీరోపై ప్రశంసల జల్లు.. ప్రపంచకప్ స్టార్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవం..!



దుబాయ్ -- 16 జనవరి 2026 -- మనగళం : అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ప్రతి నెలా ప్రతిష్ఠాత్మక అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే. తాజా ఎంపికలో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ డిసెంబర్ నెల ఉత్తమ పురుష క్రికెటర్ అవార్డును గెలుచుకున్నారు. ఇటీవల ముగిసిన యాషెస్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో 31 వికెట్లు పడగొట్టి జట్టును విజయబాట పట్టించడమే ఈ గౌరవానికి ప్రధాన కారణంగా నిలిచింది. అంతేకాదు బ్యాటింగ్‌లో కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడి అభిమానుల మన్ననలు అందుకున్నారు.

ఈ అవార్డు రేసులో న్యూజిలాండ్ బౌలర్ జాకబ్ డఫీ, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ కూడా పోటీపడ్డారు. డఫీ రెండు టెస్టుల సిరీస్‌లో 23 వికెట్లు తీసి ప్రత్యర్థులను కట్టడి చేయగా, గ్రీవ్స్ డబుల్ సెంచరీతో మెరిశారు. అయినప్పటికీ సమగ్ర ప్రదర్శనతో స్టార్క్‌కే ఎక్కువ మద్దతు లభించింది.

మహిళల విభాగంలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ విజేతగా నిలిచింది. ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో ఆమె వరుస శతకాలతో 255 పరుగులు సాధించి జట్టును ముందుకు నడిపించింది. ఈ ప్రదర్శన ఆమెకు ఈ నెల గౌరవాన్ని అందించింది. భారత ఓపెనర్ షఫాలి వర్మ, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ సునే లుస్ కూడా పోటీలో ఉన్నప్పటికీ చివరకు లారా విజయం సాధించింది.

మొత్తంగా చూస్తే పురుషుల విభాగంలో స్టార్క్, మహిళల విభాగంలో లారా తమ అసాధారణ ఆటతీరుతో అభిమానులను ఆకట్టుకుని ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకున్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.